www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 ఏప్రిల్ 2024
8 పేజీలు





ఏలూరు పశ్చిమ గోదావరి

అయినకాడికి.. అమ్మేస్తున్నారు..!

- ఏలూరు జిల్లాలో ఇంకా తెరవని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- 'పశ్చిమ'లో మూడు ప్రాంతాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- దిక్కుతోచని స్థితిలో అయినకాడికి ధాన్యం అమ్మేస్తున్న అన్నదాత
- 75 కిలోల ధాన్యం బస్తా రూ.1250కు విక్రయం
- ఎకరాకు రూ.20 వేలకుపైగా నష్టపోతున్న రైతులు



ఉంగుటూరు మండలంలో ఆరబెట్టిన రబీ ధాన్యం

'నా పేరు నీలపాల వెంకట సుబ్బారావు, మాది ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామం. రబీలో 15 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇప్పటికీ మా ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఏడెకరాల్లో పంట మాసూళ్లు చేశాను. ఏం చేయాలో తెలీక తడిపాడి కింద బస్తా రూ.1250కు విక్రయించాను. ఆరుదల అమ్మితే బస్తాకు రూ.1650 వరకూ వచ్చేది. నష్టం వాటిల్లినా తప్పని పరిస్థితుల్లో అమ్మాల్సి వచ్చింది'.

'మాది ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామం. నా పేరు మాదాల సత్యనారాయణ. రబీలో 12 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇప్పటికే ఎకరంన్నర పంట మాసూలు చేసి తడి పాడి కింద అమ్మాను. మిగిలిన పంట మాసూలు చేసి ఆరబెడుతున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధర దక్కే అవకాశం ఉంటుంది'.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న వెంకట సుబ్బారావు, సత్యనారాయణ మాత్రమే కాదు.. ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు వంటి మండలాల్లో ఎంతోమంది రైతులు రబీలో పండించిన వరి పంటను అయినకాడికి అమ్ముకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమే. రబీలో ఏలూరు జిల్లాలో దాదాపు 57 వేల ఎకరాల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమేనని చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలో ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పశ్చిమలో మాత్రం తాడేపల్లిగూడెం, తణుకు, గణపవరం వంటి మూడు ప్రాంతాల్లో మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రతి సీజన్‌లోనూ తీవ్ర అలస్యం చేయడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిపోయింది. ప్రతి సీజన్‌లోనూ రెండు జిల్లాల్లోనూ కొన్ని మండలాల్లో ముందుగా నాట్లు నాటడం, మరికొన్ని మండలాల్లో కొంత ఆలస్యంగా నాట్లు వేస్తున్నారు. ముందుగా నాట్లు నాటిన ప్రాంతాల్లో మాసూళ్లు ముందుగా చేయాల్సి వస్తోంది. అధికారులు మాత్రం అందుకు తగినట్లుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. ముందుగా నాట్లు నాటిన మండలాల్లో 20 శాతానికిపైగా మాసూళ్లు పూర్తయ్యే వరకూ కొనుగోలు కేంద్రాలు ..6లో

ఖర్చుకో లెక్కుంది.. మీరితే చిక్కుంది..!

ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎంఎల్ఎ అభ్యర్థికి రూ.40 లక్షలు వరకు పరిమితి

వార్త 5లో..

టిడిపి ఉండి టిక్కెట్ రఘురామకృష్ణంరాజుకేనా?

- రెండు రోజుల్లో ప్రకటిస్తారని విస్తృత ప్రచారం
- ఉత్కంఠభరితంగా 'ఉండి' రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం



టిడిపి ఉండి నియోజకవర్గ టిక్కెట్ నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజుకే కేటాయించే అవకాశాలున్నాయనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. రెండు రోజుల్లో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఉండి రాజకీయం ఉత్కంఠభరితంగా మారింది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఉండి టిక్కెట్‌ను సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు టిడిపి అధిష్టానం మొదటి జాబితాలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలో రెండుసార్లు ఎంఎల్ఎగా పని చేసిన వేటుకూరు వెంకట శివరామరాజు ఉండి టిక్కెట్ ఆశించి భంగపడి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. అయితే నర్సాపురం ఎంపీగా ఉన్న కనుమూరి రఘురామకృష్ణంరాజుకు బిజెపి నుంచి ఎంపీ టిక్కెట్ లభించకపోవడంతో పరిస్థితి తారుమారైంది. దీంతో మంతెన రామరాజును తప్పించి ఉండి ఎంఎల్ఎ టిక్కెట్ రఘురామకృష్ణంరాజుకు కేటాయిస్తారనే ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ క్రమంలో ఆయన పాలకొల్లు సభలో టిడిపిలో చేరడం దానికి మరింత బలాన్నిచ్చింది. అయితే ఇదే అంశంపై చంద్రబాబు సమక్షంలో చర్చ జరగడంతో ఉండి తెలుగుతమ్ముళ్లు చంద్రబాబు ఎదుట నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలోనే రామరాజు నియోజకవర్గంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే సోమవారం రామరాజు హడావిడిగా విజయవాడ బయల్దేరి వెళ్లడం చర్చనీయాంశమైంది. రఘురామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇస్తున్న నేపథ్యంలో ఆయనను టిడిపి అధినేతలు విజయవాడ పిలిచి ఉంటారనే ప్రచారం సాగుతోంది. మంగళ, బుధవారాల్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు. అయితే అదే సమయంలో టిడిపి మండల నేతలు రఘురామకృష్ణంరాజు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామాలకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. దీంతో ఉండి రాజకీయం రసవత్తరంగా మారింది.

మోటారు సైకిల్, కారు ఢీ

ఇద్దరు కొబ్బరి దింపు కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి - యలమంచిలి



అంబులెన్స్‌లో మృతదేహాలు

మండలంలోని కలగంపూడిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పెట్రోల్ బంకు వద్ద సోమవారం ఉదయం మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చిన్నతీనార్ల గ్రామానికి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు కడియాల మన్నియ్య (46), అదే మండలానికి చెందిన ఉప్మాక గ్రామానికి చెందిన పూడి అప్పారావు (58) కొంతకాలం కిందట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెల్లంక గ్రామంలో అద్దె ఇళ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రతిరోజూ మాదిరిగానే సోమవారం ఉదయం కూడా గుడిమల్లంక నుండి ద్విచక్ర వాహనంపై పాలకొల్లు ప్రాంతానికి దింపు తీయడానికి బయల్దేరారు. కలగంపూడి వద్దకు వచ్చేసరికి పెట్రోల్ పోయించుకునేందుకు కుడివైపున ఉన్న పెట్రోల్ బంకులోకి వెళ్తున్నారు. అదే సమయంలో భీమవరం నుండి కాకినాడ వెళ్తున్న కారు..6లో

ఉద్దండుల బరి..ఉండి

5లో..

16 కిలోల బంగారం, 30 కిలోల వెండి స్వాధీనం

4లో..

దళిత సమస్యలపై నిర్దిష్ట హామీలు మేనిఫెస్టోలో చేర్చాలి

8లో..

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్




మాట్లాడుతున్న సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి

పోలవరం నిర్వాసితుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మత విశ్వాసాల పట్ల విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పనిచేస్తుందని విమర్శించారు. పదేళ్ల బిజెపి పాలనలో ప్రతిపక్షాలు, మేధావులు, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. బిజెపి మతతత్వ పాలనతో ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ తన పాలనలో దేశాభివృద్ధి సాధించానని గొప్పలు చెప్పుకుంటూ సంపద సృష్టించే ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దోచిపెడుతున్నారని విమర్శించారు. మళ్లీ అధికారం కోసం బిజెపి కుట్రలు చేస్తోందని, తనకు అనుకూలంగా లేని పార్టీలపై ఇడితో దాడులు చేయించి అక్రమ అరెస్టులు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూడా కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించకుండా మోడీ పాలనకు వంత పలుకుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని మండిపడ్డారు. విభజన హామీలు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సాధనకు ..6లో

'మానవత' సేవలు అభినందనీయం

జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధరరావు


సహాయం అందిస్తున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మానవత సంస్థ జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధర రావు అన్నారు. భీమడోలు శాఖ ఆధ్వర్యంలో గుండుగొలనులో నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా ఇటీవల కాలంలో అగ్నిప్రమాదంలో ఇళ్ళను కోల్పోయి నిరాశ్రయులైన రెండు కుటుంబాల వారికి సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామిశెట్టి గంగాధర రావు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్క కుటుంబం వారికి 50 కేజీల బియ్యం, వంట సామాగ్రి, నిత్యావసర వస్తువులు అందజేశారు. భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ సౌజన్యంతో సదరు కుటుంబ సభ్యులందరికీ దుప్పట్లు, దుస్తులు సమకూర్చారు. వీటికి అదనంగా శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ రూ.2 వేల నగదును వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీజనల్ కో చైర్మన్ పసుపులేటి సాంబశివరావు, శాఖ చైర్మన్ గుళ్ల నూకరాజు, శాఖ మాజీ అధ్యక్షులు బర్ల ప్రభాకర వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అన్నే భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కనీస ధరలు రాక, పెట్టిన పెట్టుబడి కోల్పోయి రొయ్యల రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకు పోతున్నారని, అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సాగు సంక్షోభంలో ఉందని చెప్పారు. తమను ఆదుకోవాలంటూ ఆక్వా రైతులు గగ్గోలు పెడుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస ధరలు ప్రకటించినా ఆచరణలో ఆ ధరలు అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస ధరలు రొయ్యలు 30 కౌంట్‌కు రూ.500, 40 కౌంట్‌కు రూ.420, 50 కౌంట్‌కు రూ.360, 60 కౌంట్‌కు రూ.320, 70 కౌంట్‌కు రూ.290, 80 కౌంట్‌కు 270, 90 కౌంట్‌కు రూ.250, 100 కౌంట్‌కు రూ.240 ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. ఎగుమతి దారులు, దళారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరలకు కొనుగోలు చేసి, రొయ్యల రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రొయ్యలకు 100 కౌంటు రూ.205, 90 కౌంటుకు రూ.215, 80 కౌంటుకు రూ.225, 70 కౌంటుకు రూ.245, 60 కౌంటుకు రూ.265, 50 కౌంటుకు రూ.290 మాత్రమే ధరలు వస్తున్నాయని చెప్పారు. ఎకరా రొయ్యల సాగుకు రూ.60 వేలకు పైగా రైతులు నష్టపోతున్నారని వివరించారు. భారీగా పెంచేసిన సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలని, రొయ్యలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస ధరలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రొయ్యల రైతులను ఆదుకోవాలని కోరారు.

మద్యం షాపును తరలించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలోని పత్తేబాద నుంచి అశోక్ నగర్ వెళ్లే మార్గంలో డీమార్ట్ ఏరియాలోని ప్రభుత్వ వైన్ షాపును వేరే చోటికి తరలించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైన్ షాపును వేరే చోటికి తరలించాలని కోరుతూ సంతకాలతో కూడిన వినతిని సోమవారం జిల్లా రెవెన్యూ అధికారికి అందజేశారు. అనంతరం శ్యామల, యామిని మీడియాతో మాట్లాడుతూ పత్తేబాద వైన్ షాపు నివాస ప్రాంతంలోని ఇరుకు రోడ్లో ఉండటం వల్ల రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉండి సాయంత్రం సమయంలో ట్రాఫిక్ చాలా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఆ ఏరియాలో మాల్స్, ఇతర షాపుల్లో సుమారు 400 మందికి పైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారు తమ విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఆ షాప్ వద్ద పక్క సందుల్లోనూ పురుషులు మద్యం సేవిస్తూ అటుగా వెళుతున్న మహిళలపై అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆ రోడ్డు చుట్టుపక్కలకు వెళ్లాలంటే మహిళలకు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. తక్షణం పత్తే బాద డీమార్ట్ ఏరియాలోని ప్రభుత్వ వైన్ షాపును తప్పనిసరిగా తరలించాలని కోరారు. సమస్య పరిష్కారం కానిపక్షంలో మహిళలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు భాగ్యలక్ష్మి, కోహిమా పాల్గొన్నారు.

అసెంబ్లీ స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గ అసెంబ్లీ స్ట్రాంగ్(టెంపరరీ) రూమ్‌ను జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.అద్దయ్య, జంగారెడ్డిగూడెం డివిజన్ డిఎస్‌పి రవిచంద్ర పరిశీలించారు. త్వరలో అసెంబ్లీకి సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ చింతలపూడి నియోజకవర్గానికి పంపించడం జరుగుతుందని వాటిని స్థానిక అగ్రికల్చర్ మార్కెటింగ్ గోడౌన్-1లో భద్రపరుస్తారని వారు తెలిపారు. అనంతరం పోలింగ్ కేంద్రాలకు పంపించడం జరుగుతుందని అన్నారు.

పలు ప్రాంతాల్లో ముద్దరబోయిన ప్రచారం

ముసునూరు : నూజివీడు నియోజకవర్గంలో తాను చేసిన మంచి పనులు తనను గెలిపిస్తాయని స్వతంత్ర అభ్యర్థి ముద్రబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని గొల్లపల్లి, మోర్సపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గొల్లపల్లి, మోర్సపూడి, తుక్కులూరు గ్రామాలలో ర్యాలీగా ఆయన ముందుకు సాగుతూ, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ఉచిత బస్సు సౌకర్యం

టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


మహిళలతో మాట్లాడుతున్న చంటి

మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు వారికోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని నిర్ణయించుకున్నారని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి సోమవారం ఆర్‌టిసి బస్సులో ప్రయాణించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తామని, దీనిపట్ల పలువురు మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. అనంతరం పుట్ట మహేష్ కుమార్ మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మళ్లంటూ సొంత చెల్లికే అన్యాయం చేసిన జగన్మోహన్ రెడ్డిని మరోసారి నమ్మితే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని విమర్శించారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను ఆశీర్వదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కైకలూరు

నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని, చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఏలూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 109 గ్రామాల్లో మంచినీటి చెరువులపై ఆధారపడి ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారని, వేసవి దృష్ట్యా చెరువులన్నీ ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం కాలువలకు నీటి సరఫరా చేసిందని అధికారులు రెండు రోజుల్లో చెరువులు నింపుకోకపోతే నీటి సరఫరా నిలిపివేస్తామంటూ సర్పంచ్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లోని మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నిండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బిసిలంతా ఆశీర్వదించి, గెలిపించాలి

ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బిసిలంతా వారిలో ఒకడిగా తనని ఆదరించి, ఆశీర్వదించి గెలిపించాలని ఏలూరు ఎంపీ అభ్యర్థి పట్ట మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయనతో గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు ఎంపీ కార్యాలయంలో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ బిసి వ్యక్తిగా తనకు అవకాశం వచ్చిందని, బిసిలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని, వారి సహకారం అందించాలని అన్నారు. దాసరి శేషు మాట్లాడుతూ పుట్ట మహేష్ గెలుపు కోసం పనిచేస్తామని తెలిపారు. ఈ భేటీలో ఎపి గౌడసంఘం రాష్ట్ర నాయకులు, టి.నరసాపురం టిడిపి అధ్యక్షుడు నాయుడు రామకృష్ణ గౌడ్, శెట్టిబలిజ రాష్ట్ర నాయకులు చిట్టిబొయిన రామలింగేశ్వరరావు, నాయుడు మహేష్ గౌడ్, కంచర్ల శ్రీను పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గవరవరం గ్రామం మేఘలా నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘల దేవి సోమవారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. జనసేన పోలవరం నియోజవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి చిర్రి బాలరాజు, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్ట మహేష్‌ను గెలిపించాలని కోరారు. చంద్రబాబును రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రమ, తులసి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

రాజధాని నిర్మాణంతో పాటు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టిడిపి నూజివీడు నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం మండలంలోని వలసపల్లి గ్రామంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని దూరం పెట్టి, బటన్ నొక్కటం ప్రారంభించి, భవిష్యత్తు తరాల వారికి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిన ఏకైక నాయకుడు అని విమర్శించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం నిర్మాణం, రాజధాని నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు పక్కనపెట్టి మద్యపాన రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని తీర్చిదిద్దారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, మసిముక్కు సుబ్బారావు, మందలపు ధర్మరాజు, మందలపు బుజ్జి, పండు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఏసుబాబు

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట కాంగ్రెస్ మండల అధ్యక్షుడుగా రావికంపాడు పంచాయతీ నులకాని వారి గూడెంకి చెందిన ఆకుల ఏసు బాబుని కాంగ్రెస్ నియమించింది. ఈయన గతంలో మండల కాంగ్రెస్‌లో అనేక పదవుల్లో పనిచేశారు. మండలంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకుని రావడానికి ప్రణాళికతో పనిచేస్తానని అన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తనకి ఈ పదవి రావడానికి సహకరించిన పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర బాబు, ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావుకి ధన్యవాదాలు తెలిపారు.

నాడు - నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో నాడు - నేడు పనులు జరుగుతున్న పాఠశాలలో నాడు - నేడు సెక్టోరియల్ అధికారి జిసిడిఒ సబిహా సుల్తానా, సెక్టోరియల్ అధికారి వి.రమేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో పది పాఠశాలలో నాడు-నేడు పనులు జరుగుతుండగా ఆ పాఠశాలలు పరిశీలించి సుమారు ఐదు రోజుల్లోపు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం వేలేరు, కుక్కునూరు, కమ్మరిగూడెం, ఆశ్రమ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాడు-నేడు పాఠశాలల హెచ్ఎం రమేష్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

చింతలపూడి: ఎన్నికల దృష్ట్యా మద్యం, అక్రమ రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గణపతి బాబు అన్నారు. ఎస్ఇబి అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ గణపతి బాబు ఆధ్వర్యంలో చింతలపూడి సబ్ సిబ్బంది, డిటిఎఫ్ ఏలూరు సిబ్బందితో కలిసి మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామం, లింగపాలెం, వెస్ట్ యడవల్లి గ్రామాలలో, టి.నర్సాపురం మండలం కృష్ణాపురం గ్రామాలలో దాడులు జరిపారు. 5 కేసులు నమోదు చేసి 3,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 60 లీటర్ల నాటుసారాని సీజ్ చేసి, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి సబ్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, ఏలూరు డిటిఎఫ్ ఇన్స్‌పెక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

'ముస్లింల సంక్షేమం టిడిపితోనే'

ప్రజాశక్తి - చింతలపూడి

ముస్లిం మైనారిటీల సంక్షేమం టిడిపితోనే సాధ్యమని టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. సోమవారం చింతలపూడి జామియా మసీదులో ముస్లింలకు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రహీమ్ పాల్గొన్నారు.

కైకలూరు: ముస్లిం సోదరులకు టిడిపి, జనసేన కూటమితోనే రానున్న రోజుల్లో ఎంతో మేలు జరుగుతుందని కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం రైల్వే స్టేషన్ రోడ్‌లో సత్యవతి రైస్ మిల్‌లో ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ అభ్యర్థి పుట్ట మహేష్ కుమార్ యాదవ్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని వారు ముస్లిం సోదరుల నుంచి ఓట్లను అభ్యర్థించారు.

అభివృద్ధి పనులకు ఆర్థిక సాయం

ఆగిరిపల్లి: ప్రభుత్వ హోమియో వైద్యశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు తమ వంతు సహకారంగా ఆగిరిపల్లి పెన్షనర్స్ అసోషియేషన్ తరపున ఆర్థిక సహాయం అందజేయడం ఎంతో స్ఫూర్తిదాయకమని ఆగిరిపల్లి హోమియో వైద్యశాల వైద్యాధికారిణి డి.రజిత అన్నారు. సోమవారం ఆగిరిపల్లి పెన్షనర్స్ అసోషియేషన్ తరపున హోమియో వైద్యశాలల్లో నిర్మిస్తున్న యోగాషెడ్డు, టైల్స్, డిస్పెన్సరీకు రూ.10 వేలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోషియేషన్ సభ్యులు జె.చంద్రమౌళీశ్వరరావు, వివిఎస్ఎన్.రాజు, పార్థసారథి పాల్గొన్నారు.

పంట కాలువల పరిశీలన

ముదినేపల్లి: మండలంలోని ప్రధాన పంట కాలువలను, బ్రాంచి కాలువలను సోమవారం జిల్లాస్థాయి అధికారులు పర్యటించి పరిశీలించారు. ఎస్‌సి ఆర్‌డబ్ల్యూఎస్ ఎన్‌వి.సత్యనారాయణ, జెడ్‌పి సిఇఒ ఏలూరు కెఎస్ఎస్.సుబ్బారావులు మండలంలోని కాకరవాడ, చేవూరు, దేవరం, శ్రీహరిపురం తదితర గ్రామాల్లో పర్యటించి కాలువల స్థితిగతులను పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఏలూరు ఆర్‌డిఒ ఎస్ఎస్‌కె.ఖాజావలీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

రబీలో ధాన్యం సేకరణ నిమిత్తం ఉంగుటూరు మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని రైతులు, సాగుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు ఆర్‌డిఒ ఎస్ఎస్‌కె.ఖాజావలీ అన్నారు. సోమవారం ఉంగుటూరు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఆరుదల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన ట్రెయినీ కలెక్టర్ భానుశ్రీ, తహశీల్దార్ కట్టా శివయ్య, మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేశ్, సిఎస్ డీటీ స్వర్ణదుర్గ, వ్యవసాయ సహాయకులు, రైతులు, సాంకేతిక సహాయకులతో చర్చించారు. ఈ మండలంలో 22,875 ఎకరాల్లో కాలువ, బోర్లు కింద సాగు చేశారన్నారు. పిఆర్-126 రకం 739 ఎకరాలు, ఎస్ఎల్-10 వంగడం 438 ఎకరాలు, ఎంటియూ-1,121 రకం 1100 ఎకరాల్లోనూ, ఇతర రకాలు 54 ఎకరాల్లో సాగులో ఉన్నాయి. ఇంత వరకూ



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఆర్‌డిఒ

నారాయణపురం, వెల్లమిల్లి, ఉంగుటూరు, నాచుగుంట, నీలాద్రిపురం, గొల్లగూడెం, దొంతవరం, కాగుపాడు, కైకరం, ఎ.గోకవరం, బొమ్మిడి రావులపర్రు గ్రామాల్లో 2,239 బస్తాల పచ్చి ధాన్యాన్ని రైతులు కల్లాల్లోనే రైసు మిల్లర్లకు అమ్ముకున్నారన్నారు. ఆరుదల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి అధిక ధర పొందాలని అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఉంగుటూరు ఆర్‌బికెకు 2 వేల గోనె సంచులు సిద్ధంగా ఉంచామని సిఎస్ డీటీ వెల్లడించారు.

వేసవిలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వేసవికాలంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేస్తే వడదెబ్బ తదితర అనారోగ్య సమస్యలుకు గురయ్యే అవకాశం ఉందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జెపి కాలనీలో పిఎంఎస్ఎంఎ వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చిన గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ వేసవికాలంలో అధిక వేడి వల్ల గర్భిణీ స్త్రీల శరీరంలో ఉన్న నీరు చెమట రూపంలో బయటకు పోవడం వల్ల వడదెబ్బకు గురై తొందరగా నిరసించి పోయే అవకాశం ఉందన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరిగి జ్వరాల బారినపడే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండలో దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేయవద్దని సూచించారు. ఎండలో ఎక్కువ సమయం పని చేయరాదని, కొబ్బరి బొండాల నీరు, గ్లూకోజ్ వాటర్, మజ్జిగ, ఒఆర్ఎస్ ద్రావణాన్ని తరచుగా తీసుకోవాలని తెలిపారు. ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే జాబితాలో చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ఉన్నారని, కాటన్ దుస్తులు, తలపాగా టోపీ, గొడుగు వాడాలని, వడదెబ్బకు గురైతే వెంటనే వైద్య సదుపాయం పొందాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నీలిమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిబి కెనాల్‌కు తాగునీరు విడుదల

ముదినేపల్లి: మండలంలోని ప్రధాన పంట కాలువ సిబి కెనాల్‌కు సోమవారం అధికారులు తాగునీటిని విడుదల చేశారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద తాగునీటిని ఉదయం విడుదల చేశారు. ప్రస్తుతం నీరు సాయంత్రం 6 గంటలకు మండలంలో ప్రవేశించింది. మండలంలో మంచినీటి చెరువులు అడుగంటి నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. మండలంలోని 32 పంచాయతీల్లో తాగునీటి చెరువులు దాదాపు అన్ని అడుగంటాయి. ఈ నేపథ్యంలో అధికారులు సిబి కెనాల్‌కు మాత్రమే తాగునీటిని విడుదల చేశారు. మరో రెండు ప్రధాన పంట కాలువలైన మండలంలోని పోల్‌రాజ్ కెనాల్, బిఎండి ఛానల్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది. సిబి కెనాల్‌కు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రావిటీ ద్వారా మంచినీటి చెరువులకు నీరు ఇచ్చే అవకాశం లేనందున ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శులు తాగునీటిని పంట


సిబి కెనాల్‌కి విడుదల చేసిన తాగునీరు

కాలువల నుంచి ఆయిల్ ఇంజన్ ద్వారా లిఫ్ట్ చేసుకోవాల్సిందిగా కోరారు. కాలువల ద్వారా వచ్చే తాగునీటిని ఆక్వా రైతులు చేపల చెరువులకు మళ్ళించకుండా పోలీస్, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో నిఘా బృందాలు ఏర్పాటు చేసి నీటిచౌర్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జలవనరుల శాఖ ముదినేపల్లి సెక్షన్ ఎఇఇ వివి.కిషోర్ తెలిపారు.

'చట్టాలపై అవగాహన అవసరం'

ఏలూరు అర్బన్: కక్షిదారులకు సత్వర కేసుల పరిష్కారం నిమిత్తం ఉచిత న్యాయ సహాయం అందించటం, చట్టాలపై అవగాహన కల్పించడం కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం రూపొందించటం జరిగిందని శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా ప్రయోజిత సేవల లోక్ అదాలత్ సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ మాట్లాడుతూ ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో విద్య, వైద్య, పోస్టల్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, రవాణా, టెలికం సేవలలో లోపాలపై విచారణ జరుగుతుందని తెలిపారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని, అలాగే ఎటువంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

'ప్రమాదాలకు నిలయంగా రహదారులు'

బుట్టాయగూడెం: గ్రామీణ ప్రాంత రహదారులు, ఆర్‌అండ్‌బి రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయని అఖిల భారత రైతు కూలీ సంఘం ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పోలవరం నియోజకవర్గ అభ్యర్థి సరియం రామ్మోహన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్డి గణపవరం పంచాయతీ పరిధిలో వెలుతురు వారి గూడెంలో సోమవారం ప్రజా సమస్యలపై జనరల్ బాడీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గం మెజారిటీ మండలాలు షెడ్యూల్ ప్రాంతంలో ఉన్నాయన్నారు. 1/70 చట్టం పరిధిలో గిరిజనేతరులు అక్రమంగా భూములు కలిగి ఉన్నారని, వారిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారికి నోటీసు ఇచ్చి స్వాధీనం చేసుకొని, గిరిజనులకు పంపిణీ చేయాలని కోరారు. షెడ్యూల్ ప్రాంతంలో రహదారుల నిర్మాణం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పామాయిల్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

లక్కవరం గ్రామపంచాయతీ పరిధిలోని కంఠమనేని వారి గూడెంలోని పామాయిల్ తోటలో గెలల కోతకు వెళ్లి కార్మికుడు మృతి చెందాడు. మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు గాంధీ(35) ఇతనికి భార్య, ఒక పాప ఉన్నారు. ప్రస్తుతం గాంధీ భార్య ఆరోనెల గర్భిణి, గాంధీ సోమవారం ఉదయం కౌలు రైతు పట్టపు మునేశ్వరరావు అనే రైతుకి పామాయిల్ గెలలు కోతకు ఐరన్ పైపుతో కోస్తున్న తరుణంలో విద్యుత్ లెవెన్ కేవీ వైరు తగిలి గాంధీ ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే కారులో స్థానిక రైతు లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపిన లక్కవరం వైద్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఆసుపత్రి లోపల కారును కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న లక్కవరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

భీమడోలు: జాతీయ రహదారిపై కురెళ్ళగూడెం, కొండాలమ్మ గుడి సమీపంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. భీమడోలు పోలీసుల తెలిపిన వివరాల మేరకు ఏలూరు తూర్పు వీధి ప్రాంతానికి చెందిన మల్ల దుర్గా సాయి(25) సోమవారం ఉదయం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై బయటకు వచ్చాడు. ఉదయం 11 గంటల సమయంలో దుర్గా సాయి ఆచూకీ కోసం తండ్రి ఫోను చేయగా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ ఎత్తి అతనికి కురెళ్ళ గూడెం గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న తండ్రి అప్పటికే దుర్గాసాయి చనిపోయినట్లు గుర్తించారు. ఈ మేరకు మినీ కంటైనర్ ఢీకొన్న కారణంగా తన కుమారుడు చనిపోయినట్లు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం సాయంత్రం పి.రాజవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన టి.వెంకట్రావు(38) కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నాటుసారా స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరంపై సోమవారం సాయంత్రం ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడులలో 100 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని 2,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన కొప్పుల శ్రీనుని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఎక్స్‌ఎల్ సూపర్ బండిని స్వాధీన పరచుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి సంపద సృష్టిస్తాం : చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

తెలుగు ప్రజల్లో ఎంతో విశిష్టత కలిగిన ఉగాది పండుగ ఈసారి ప్రజలకు మరో సరికొత్త యుగాదిని అందించనుందని టిడిపి దెందులూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి అధోగతి పాలైందని, దెందులూరు నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో అభివృద్ధి అనే పదాన్ని పూర్తిగా విస్మరించిన వైసిపి నాయకులు తమ అవినీతి అక్రమ కార్యకలాపాలతో నియోజకవర్గాన్ని సర్వ నాశనం చేశారన్నారు. చుట్టు పక్కల జిల్లాల్లో సైతం పేకాట, కోడి పందేలకు దెందులూరుని కేంద్రంగా చేసి, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ అరాచక పాలన కొనసాగించారని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అటువంటి ప్రజా వ్యతిరేక పాలన సాగించిన వైసిపి నాయకులకు మరో నెల రోజుల్లో తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దెందులూరు నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఎల్ఎ రామరాజు ర్యాలీ బల ప్రదర్శనేనా!

ప్రజాశక్తి - ఆకివీడు

ఉండి ఎంఎల్ఎ రామరాజు ఆదివారం నియోజకవర్గంలో నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీపై కార్యకర్తల అభిమానులు, పార్టీ నాయకుల్లో పలు సందేహాలు తలెత్తుతున్నాయి. తన బలాన్ని చూపించేందుకు రామరాజు చేసిన ప్రయత్నం అన్నది ఇక్కడ చర్చ. పార్టీ టిక్కెట్ ఆయనకు వస్తుందా రాదా అనేది ఇంకా స్పష్టం కాకముందే ఆయన నియోజకవర్గంలో మోటార్ సైకిల్ ర్యాలీ చేసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఒక పక్క గత నాలుగు రోజులుగా ఉండి టిడిపి టిక్కెట్ కనుమూరి రఘు రామకృష్ణంరాజుకు కేటాయించినట్టు వార్తలు వినిపించాయి. ఆ స్థితిలో తాను కార్యకర్తల అభిమానినని వారి అభిప్రాయం ప్రకారం సీటు తనకు ఇవ్వాలని అంటూనే పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాన్ని పాటిస్తానని రామరాజు తెలిపారు. ఈ స్థితిలో చంద్రబాబు నాయుడును ఎదిరించకుండా తన బలాన్ని ప్రదర్శించి తనకు సీటు ఇవ్వాలని ఆయన చేసే ప్రయత్నమా ఈ ర్యాలీ అన్నది ఇక్కడ అభిమానుల అభిప్రాయం. సాధారణంగా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు బి-ఫారం ఎన్నికల అధికారులకు అందజేసినప్పటి నుండి ప్రచారం ముగిసే వరకూ పలు రకరకాల ప్రచారాలు నిర్వహిస్తుంటారు. అయితే ప్రస్తుతం పార్టీల అభ్యర్థులు అదేవిధంగా అవలంబించే పరిస్థితి కనిపిస్తున్నాయి. అందుకు భిన్నంగా రామరాజు నామినేషన్ వేయకముందే ర్యాలీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ పరిస్థితుల్లో అభిమానులు పార్టీ కార్యకర్తల్లో మరింత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అభిమానుల్లో చర్చ మరింత జోరుగా సాగుతోంది.

భీమవరం ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా శ్రీనివాస్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం




ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భీమవరం అభ్యర్థిగా దండు శ్రీనివాసరాజును నియమిస్తూ పార్టీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. భీమవరంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జనరల్ బాడీ సమావేశం స్థానిక కార్యాలయంలో కనుమూరి వెంకటపతి రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి, ఎల.కృష్ణమూర్తి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, స్వతంత్రంగా పోటీ చేస్తోందన్నారు. ఎవరితో ఎటువంటి పొత్తులు లేవన్నారు. రాష్ట్రంలో అనేక స్థానాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులను నిలబెట్టేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లాలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిందన్నారు. కొత్త జిల్లా ఏర్పాటుకు ఉద్యమం చేసి ఫలితాలు సాధించామన్నారు. దీనిలో భాగంగానే భీమవరంలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా శ్రీనివాసరాజును నియమించినట్లు తెలిపారు. సమావేశంలో వెంకటపతిరాజు, దుర్గారావు, ఎ.శ్రీను, నడింపల్లి.నాగభూషణం, వాటాల.రాంబాబు, కోటేశ్వరరావు, దండు.అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పనులను పూర్తిచేస్తాం

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి



చింతలపూడి ఎత్తిపోతల పనులను పూర్తి చేస్తామని, సాగునీరందించి రైతుల కళ్లలో ఆనందం చూస్తామని టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడిలో షాదీఖానా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం పూర్తి కావాలన్నా, చింతలపూడి ఎత్తిపోతల పథకం, ముఖ్యమంత్రిగా సాగునీరందించాలన్నా, చంద్రబాబు నాయుడు ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం అనేవి రాష్ట్రానికి రెండు కళ్లు అన్నారు. వైసిపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. సంక్షేమం పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబు నాయుడు వల్లే జరుగుతుందన్నారు. సంపదను సృష్టించి రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తారన్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15,000, చంద్రబాబు నాయుడు ఇస్తారన్నారు. మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. ఉచిత బస్సు సౌకర్యం, యువతీ యువకులకు నెలకు రూ.1500 ఉమ్మడి [illegible]. నిరుద్యోగ భృతి కింద రూ.3000 నెలకు నిరుద్యోగులకు ఉమ్మడి ప్రభుత్వం అందించనుందన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో రాగానే 20 లక్షల ఉద్యోగాలు, ఉమ్మడి ప్రభుత్వం ప్రకటించేందుకు సిద్ధం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ఆయా ప్రాంతాల్లో చెడు నడత కలిగిన వ్యక్తులను బైండోవర్ చేసి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో సోమవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విధులు ఎలా నిర్వహించాలి, పోలీస్ శాఖ సమర్థవంతంగా ఎలా పనిచేయాలి తదితర అంశాలపై ఏలూరు రేంజ్ డిఐజి సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టుల్లో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు, బంగారం వంటి వాటిని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇప్పటికే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వారెంట్లను వెంటనే అమలు చేసి వారిని అరెస్టు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, అదనపు ఎస్‌పి స్వరూపరాణి, ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

16 కిలోల బంగారం, 30 కిలోల వెండి స్వాధీనం

వేర్వేరు చోట్ల రూ.28 లక్షలు నగదు సీజ్

ఏలూరు స్పోర్ట్స్: కలపర్రు టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద సోమవారం భారీగా బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి సిఐ శ్రీనివాస్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తనిఖీలు నిర్వహిస్తుండగా విజయవాడ నుండి ఏలూరు, నరసాపురం ప్రాంతాలకు బంగారం, వెండి ఆభరణాలను ఎటువంటి బిల్లులూ లేకుండా రవాణా చేస్తున్న విషయాన్ని గుర్తించారు. ఆ వాహనంలో 16 కేజీల బంగారు ఆభరణాలు, 30 కిలోల వెండి ఆభరణాలు అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాటిని సీజ్ చేశారు. ఏలూరు వైపు నుండి విజయవాడ వైపు కొరియర్ వాహనంలో ఎటువంటి ఆధారాల్లేకుండా తరలిస్తున్న రూ.15 లక్షలు నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎవరైనా రూ.50 వేలకు పైబడి నగదు తమ వెంట తీసుకువెళ్లాలంటే కచ్చితంగా అనుమతులు తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చెక్‌పోస్టు సిబ్బంది, పెదపాడు పోలీసులు పాల్గొన్నారు.

చింతలపూడి: లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఎస్‌ఎఫ్‌టి బృందం డిటి సునీత ఆధ్వర్యాన నిర్వహించిన తనిఖీల్లో ఈ నగదు సీజ్ చేసినట్లు చెప్పారు.

ఆకివీడు: ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించిన తనిఖీల్లో రూ.12 లక్షల నగదు పట్టుబడింది. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్.శ్రీకర్, ఎఎస్ఐ కె.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం భీమవరం వెళ్లే జాతీయ రహదారిపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఒక మోటారు సైకిల్‌పై రూ.12 లక్షల నగదు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తాను చేపల చెరువుపై గుమాస్తానని, తమ రైతు విక్రయించిన చేపల తాలూకా డబ్బు వ్యాపారి నుండి తీసుకెళ్తున్నామని, తమది రాయలం అని





ఉద్దండుల బరి.. ఉండి

ప్రజాశక్తి - కాళ్ల

డెల్టా, తీర ప్రాంతాల మేలు కలయికగా ఉన్న ఉండి నియోజకవర్గం చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద తాగునీటి సరస్సుల్లో ఒకటిగా ఉన్న కొల్లేరు సరస్సు ఒక వైపు.. మరో వైపు ఉప్పుటేరు, ప్రధాన మేజర్ కాలువల ద్వారా పుష్కలమైన జలసిరులతో బంగారు పంటలు పండుతుండడంతో పాటుగా ఆక్వా పరిశ్రమ వృద్ధి చెందుతోంది. ఈ నియోజకవర్గంలో ఉద్దండులైన నేతలెందరో చట్టసభలకు పంపిన చరిత్ర ఉంది.

> మండలాలు : ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు
> లోక్‌సభ నియోజకవర్గం పరిధి : నరసాపురం
> ప్రస్తుత ఎంఎల్ఎ మంతెన రామరాజు

ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలోని 238 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. పురుషులు 10,94,14 మంది, స్త్రీలు 11,35,83 మంది, ట్రాన్స్ జెండర్స్ ఇద్దరు, ఇటీవల కొత్తగా 102 మంది ఓటర్లు చేరారు. ప్రస్తుతం 2,23,101 మంది ఓటర్లు ఉన్నారు.

ఉండి మండలంలో 19 గ్రామాలు, ఆకివీడు మండలంలో 16 గ్రామాలు, కాళ్ల మండలంలో 21 గ్రామాలు, పాలకోడేరు మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల్లో 70 గ్రామాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో వరి, ఆక్వా ప్రధాన పంటలు. వరి సుమారు 40 వేల ఎకరాల్లో, 55 వేల ఎకరాల్లో చేపలు, రొయ్యలు సాగవుతున్నాయి.

ప్రస్తుతం 3,12,091 మంది జనాభా ఉన్నారు. ఆకివీడు నగర పంచాయతీగా ఏర్పడింది. టిడిపి కంచుకోటగా ఉన్న ఉండి నియోజకవర్గంలో ఈసారి పాగా వేయడానికి వైసిపి గట్టి ప్రయత్నాలు చేస్తోంది. టిడిపి, వైసిపి అభ్యర్థిత్వాలు ఖరారైతే సమీకరణాలు మారతాయి.

అక్షరాయుధాలందించిన ఘనత..

స్వాతంత్రోద్యమ కాలం నుంచి ఉండి నియోజకవర్గానికి ఎంతో చరిత్ర ఉంది. అప్పట్లో ఉద్యమానికి ఊపిరిగా ఉండే ప్రసార సాధనాలైన పత్రికలన్నీ రహస్యంగా ముద్రించి పడవలు, దోనెల్లో ప్రజలకు చేర వేసిన ఘనత ఈ నియోజకవర్గానికి ఉంది. దండి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడమే కాకుండా ఉద్యమానికి రహస్యంగా అక్షరాయుధాలందించిన ఘనత కూడా ఉంది. ప్రత్యేకాంధ్ర ఉద్యమం అంటే ఎన్నో ఉద్యమాలకు చేయూతనిచ్చి చరిత్రకెక్కింది. అల్లూరి సీతారామరాజు జన్మించిన మోగల్లు ఈ నియోజకవర్గంలోనే ఉంది. సర్దార్ దండు నారాయణ రాజు, దండు సత్యనారాయణ రాజు, ఉద్దరాజు రామం, దంతులూరి నారాయణరాజు, పల్లి లక్ష్మీ నరసింహారెడ్డి, దండు విశ్వనాథరాజు, దాట్ల సూర్యనారాయణ రాజు ఇలా ఎంతోమంది ఆనాటి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ ఇసిఐఎల్ ప్రాంతంలో ఎఎస్‌రావు నగర ఆవిర్భావానికి ఆధ్యుడు అయ్యగారి సాంబశివరావు, స్వామి జ్ఞానానంద వంటి శాస్త్రవేత్తలు ఈ ప్రాంతానికి చెందిన వారే.

కీలక సామాజిక వర్గాలు..

ఉండి నియోజకవర్గంలో వెనుకబడిన తరగతుల వారు అత్యధికంగా ఉన్నారు. తరువాత కాపు సామాజిక వర్గం, క్షత్రియులు ఉన్నారు. ఎస్‌సి, మైనార్టీలు, ఎస్‌టిలు తరువాత స్థానాల్లో ఉన్నారు. ఎన్నికల్లో క్షత్రియ సామాజికవర్గం తీవ్రంగా ప్రభావితం చేస్తారు. కాపు సామాజికవర్గం ఓటింగ్‌తో అభ్యర్థి విజయావకాశాలు కనిపిస్తాయి. హిందూ ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఉండి ఉన్నత పదవులకు కేంద్రం..

ఉండి నియోజకవర్గంలోని నాయకులు ఉన్నత పదవులు అలంకరించిన వారే ఉన్నారు. కలిదిండి రామచంద్రరాజు ఎన్‌టి రామారావు మంత్రివర్గంలో చిన్న తరహా మంత్రిగా, చంద్రబాబు మంత్రివర్గంలో విద్యుత్ శాఖ

టిడిపికి కంచుకోట

మంత్రిగా పనిచేశారు. టిటిడి ఛైర్మన్‌గా పాందువ్వ కనకరాజు, కలిదిండి రామచంద్రరాజు, గాదిరాజు జగన్నాథరాజు, గోకరాజు రంగరాజు, కనుమూరు బాపిరాజు, టిటిడి బోర్డు సభ్యుడుగా గోకరాజు రామరాజు పని చేసి పదవులకు వన్నె తెచ్చారు. నర్సాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు, బిసిసిఐ మాజీ ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజుది ఈ నియోజకవర్గమే. పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆచంట ఎంఎల్ఏ చెరుకువాడ శ్రీరంగనాథరాజుది కూడా ఈ నియోజకవర్గమే.

విశిష్టతలు..


ఈ నియోజకవర్గానికి ఉత్తరాన ఉంగుటూరు నియోజకవర్గం, పశ్చిమాన కొల్లేరు, దక్షిణాన ఉప్పుటేరు, తూర్పున భీమవరం నియోజవర్గం ఉంది. ఆకివీడు మండలం సరిహద్దులో కొల్లేరు సరస్సు ఉంది. ఉండి మండలం ఉప్పులూరులో 1335 నుంచి చెన్నకేశవ స్వామి ఆలయానికి దళితులే అర్చకులుగా కొనసాగుతుండడం ఒక ప్రత్యేక అంశం. కాళ్ల మండలం పెదఅమిరంలో 200 సంవత్సరాల క్రితం నాటి జైన్ దేవాలయం, కాళ్లకూరులో 450 ఏళ్ల క్రితం నిర్మించిన వెంకటేశ్వరస్వామి వారి ఆలయం ముఖ్యమైంది. పాలకోడేరు మండలం పెన్నాడ వంకాయలకు విపరీతమైన గిరాకీ ఉంది.


ఆక్వా సాగు

విలక్షణ తీర్పు నిచ్చే ఓటర్లు..

1951లో ఉండి నియోజకవర్గం ఏర్పడింది. 16 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఒకసారి మధ్యంతర ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఐదుసార్లు, ఇండిపెండెంట్లు రెండు సార్లు, టిడిపి ఎనిమిది సార్లు ఈ స్థానాన్ని కైవశం చేసుకున్నాయి. 1970లో ఉపఎన్నిక జరిగింది. 16 పర్యాయాల్లో ఐదు సార్లు మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయిరాజు)కు రెండు సార్లు ఎంఎల్ఏగా వేటుకూరి వెంకట శివరామరాజు ఎన్నికయ్యారు.

నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 1952లో ఎంఎల్ఏగా ఎన్నికైన దంతులూరి నారాయణరాజు (కాంగ్రెస్), 1955లో గాదిరాజు జగన్నాథరాజు (కాంగ్రెస్) ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. 1962లో ఎంఎల్ఏగా ఎన్నికైన గోకరాజు రంగరాజు (కాంగ్రెస్), రెండో దఫా 1967లో ఎన్నికల్లో పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థి కట్రేడి కుసుమేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. కట్రేడ్డి కుసుమేశ్వరరావు మరణానంతరం 1970లో ఉపఎన్నికల్లో ఆయన భార్య కట్రేడ్డి ఆండాళ్లమ్మ గెలుపొందారు. 1972లో ఎంఎల్ఏగా గెలుపొందిన దండుబోయిన పేరయ్య (కాంగ్రెస్), ఆయన శిష్యుడిగా పేరొందిన కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయిరాజు) చేతిలో ఓటమి చెందారు. 1978లో ఎంఎల్ఏగా ఎన్నికైన గొట్టుముక్కల రామచంద్రరాజు (కాంగ్రెస్ ఐ), 1983లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1983 నుంచి గెలుపొందుతున్న మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజును ఓడించడానికి 2004 వరకూ కాంగ్రెస్ అభ్యర్థులను మారుస్తూ



వచ్చి విఫలమైంది. 2004లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతి వచ్చింది. ఎన్నికల్లో డబుల్ హ్యాట్రిక్ సాధిద్దామనుకున్న ఆశ నెరవేరలేదు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పాతపాటి సర్రాజు 2004లో కలిదిండి రామచంద్రరాజుపై గెలుపొందారు. 2009 ఎన్నికల్లో శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వెలుగులోకి వచ్చిన వేటుకూరి వెంకట శివరామరాజు టిడిపి తరపున పోటీ చేసి మాజీ ఎంఎల్ఏ పాతపాటి సర్రాజుపై గెలుపొందారు. 2014 ఎన్నికల్లో శివరామరాజు రెండోసారి పోటీ చేసి పాతపాటి సర్రాజుపై 36 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసి మంతెన రామరాజు పివిఎల్ నరసింహరాజుపై పదివేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మాజీ ఎంఎల్ఏ శివరామరాజు నరసాపురం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి వైసిపి అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజు చేతిలో 50,000 వేల ఓట్లతో ఓడిపోయారు.

గుక్కెడు నీటి కోసం తిప్పలు..

ఒకపక్క మంచినీటి సరస్సు.. పంట కాలువల పరవళ్లు.. ఇంకో పక్క సముద్రం.. అయితే గొంతు తడి చేసుకునేందుకు తాగునీటికి మాత్రం కటకటలాడాల్సిందే. ఆక్వా రంగం నుంచి వచ్చే వ్యర్థాల వల్ల పంట కాలువలు, తాగునీటి చెరువులు, బోదెలు, భూగర్భ జలాలు కలుషితమై తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న ఈ ప్రాంతం తాగునీటి కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి. బావుల్లో ఉప్పునీరు తాగడానికి పనికిరాని పరిస్థితి. సముద్ర తీర ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు పూర్తిగా ఉప్పు మయమైపోయాయి. గోదావరి నదిపైనే ఆధారపడి జీవించాలి. తాగునీటి కోసం రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది.

నియోజకవర్గంలో ఆక్వారంగం గణనీయంగా విస్తరించడంతో అన్ని ప్రాంతాలకూ స్వచ్ఛమైన తాగునీరు ఉండడం లేదు. సుజల స్రవంతి ఆర్ఓ మంచినీటి పథకాలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వంతెనలు శిథిలావస్థకు చేరాయి. పంట, మురుగు కాలువల్లో ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో వరి, ఆక్వా రైతులు ఏటా నష్టపోతున్నారు. విద్య, వైద్య రంగాల్లో ఉండి నియోజకవర్గం పెద్దగా ప్రగతి సాధించలేకపోయింది. ఉండి, కాళ్ల మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు ఇప్పటికి కలగానే మిగిలిపోయింది.

యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. పేదలకు పక్కా గృహాలు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసినా నిర్మాణ వ్యయం పెరగడంతో లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టినా బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. ఆక్వా ఉత్పత్తులు ఏటా పెరుగుతున్నా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న కోల్డ్ స్టోరేజ్‌ల హామీని నెరవేర్చాలని ఆక్వారైతులు కోరుతున్నారు.

ఖర్చుకో లెక్కుంది.. మీరితే చిక్కుంది..!

> నిబంధనలు మీరితే చర్యలు తప్పవంటున్న ఎన్నికల సంఘం
> పెడచెవిన పెడుతున్న రాజకీయ పార్టీలు
> ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుపై ప్రత్యేక నిఘా
> జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఓటర్ల తుది జాబితాను విడుదల చేయడంతోపాటు ఇవిఎంల పరిశీలన, గోడౌన్లో భద్రపరచడం, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, అధికారులకు, సిబ్బందికి ఎన్నికల శిక్షణ, కేంద్ర ప్రత్యేక బలగాల ఏర్పాటు వంటివన్నీ ఏర్పాటు చేసి ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. దీనిలో ప్రధానంగా అభ్యర్థుల ఖర్చులపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా పెట్టింది.

ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ముమ్మరంగా ర్యాలీలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో ప్రతిదీ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో అధికార యంత్రాంగం ఎన్నికల వ్యయాన్ని లెక్కించే పనిలో నిమగ్నమైంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థులు చేసే ఖర్చును పార్టీ ఖర్చుగా పరిగణిస్తారు. నామినేషన్ వేసిన రోజు నుంచి చేసే ప్రతిఖర్చు వారి వ్యయ పరిమితిలోకి వస్తుంది. ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎంఎల్ఏ అభ్యర్థికి రూ.40 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం నిర్ణయించిన ఈ పరిమితి మేరకు నామినేషన్‌కు ముందు రోజే అభ్యర్థి జాతీయ బ్యాంకులో కొత్త అకౌంట్ ఓపెన్ చేసి ఆ మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. నామినేషన్ తర్వాత నుంచి ర్యాలీలు, సమావేశాలు, భోజనాలు, వాహనాలు, సౌండ్ సిస్టమ్, తదితర ఎన్నికల నిమిత్తం చేసే ఖర్చులన్నింటినీ అభ్యర్థి అక్కౌంట్ నుంచి మాత్రమే చెల్లించాలి.

ప్రత్యేక బృందాల నిరంతర నిఘా

జిల్లాలో 137 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో 19 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు (ఎఫ్ఎస్ఇ), 28 స్టాటిక్ సర్వైలైన్ టీమ్స్ (ఎస్ఎసి), 24 మోడల్ కోడ్ ఆఫ్ కండాక్ట్ టీమ్స్ (ఎంసిసి), 59 వీడియో సర్వైలైన్ టీమ్స్ (విఎస్), ఏడు వీడియో వ్యూయింగ్ టీము (వివిటి)లు ఉన్నాయి. ఈ బృందాలు ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు జరిగేలా కృషి చేస్తాయి. అభ్యర్థులు చేసే వ్యయంపై వారికి తెలియకుండా నిఘా ఉంచారు. అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు, వారి కింద అకౌంటింగ్ టీములు ఉంటాయి. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీలకుగాను మొత్తం ఎనిమిది మంది అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించారు. వీరు ఎప్పటికప్పుడు రికార్డులు నిర్వహిస్తారు. నామినేషన్ నుంచి ఎన్నికలు ముగిసేలోగా మూడుసార్లు తమ వద్ద ఉన్న వివరాలతో అభ్యర్థులు చూపిన వ్యయ వివరాలతో సరిపోల్చి చూస్తారు. అభ్యర్థులు వ్యయం తక్కువ చూపిస్తే తమ వద్ద ఉన్న ఆధారాలను వారికి చూపించి సరిచేయిస్తారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించిన నాటి నుంచి నెలరోజుల్లోగా అభ్యర్థులు తమ పూర్తి ఖర్చుల వివరాలు, వాటి బిల్లులను అందించాలి. ప్రచారంలో భాగంగా ఏదైనా ర్యాలీ నిర్వహించినప్పుడు విఎస్‌టి వీడియో తీసి ఎన్ని ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లు ఉన్నాయి, ఫ్లెక్సీలు, లౌడ్ స్పీకర్లతోపాటు జెండాలు, కండువాలు, పోస్టర్లు, కరపత్రాలు తదితర ఎన్నికల సామగ్రి ఎన్ని ఉన్నాయి, భోజనాల ఖర్చు ఎంత తదితర అంశాలను పరిశీలించి జిల్లా కమిటీ విడుదల



చేసిన స్టాండర్డ్ రేట్స్ ఛార్ట్ ప్రకారం ఖర్చును లెక్కిస్తారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్ చేసే ఖర్చును అభ్యర్థుల ఎన్నికల వ్యయంలోకి తీసుకుంటారు. పరిమితికి మించి ఖర్చు చేసినా, బిల్లులు సక్రమంగా చూపించపోయినా వారికి చిక్కులు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రూ.41.63 లక్షలు సీజ్ - 22 కేసులు నమోదు

జిల్లావ్యాప్తంగా అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఐదు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీల్లో రూ.41.63 లక్షల ఇప్పటి వరకు సీజ్ చేశారు. అలాగే 22 కేసులు కూడా నమోదు చేశారు. దీంతోపాటు 2,322 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 23 మంది వాలంటీర్లను, ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగం చేస్తున్న ఒకరిని విధుల నుంచి తొలగించారు. శాశ్వత ఉద్యోగులు ఇద్దరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు మరో ఇద్దరు వాలంటీర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులపై ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటిలో టిడిపి-2, ఇతరులపై-3 కేసులు ఉన్నాయి. సి-విజిల్ ద్వారా 142 ఫిర్యాదులు అందగా వాటన్నింటినీ పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇసి ఆదేశాలు పట్టని రాజకీయ పార్టీలు

అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రత్యేక బృందాలు డేగ కళ్లతో గమనిస్తూనే ఉన్నాయి. పరిమితికి మించి ఎన్నికల వ్యయం దాటితే అభ్యర్థులకు చిక్కులు తప్పవని హెచ్చరికలు ఉన్నా అభ్యర్థులు మాత్రం ఇవేమీ పట్టించుకోవట్లేదు. ఎన్నికల సంఘం ఆదేశాలను సైతం ధిక్కరించి ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాల పంపిణీ, జెండాలు, భోజనాలు, ర్యాలీకి కార్లు, మోటార్ సైకిళ్లపై వచ్చినవారికి బండిలో పెట్రోల్ పోయించడం, రూ.300 నుంచి రూ.వెయ్యి వరకు పంపిణీ చేయడం జరుగుతోంది. ఇదంతా బహిరంగంగానే జరుగుతుంది. అయితే అభ్యర్థులు ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. అధికార పార్టీకి ఒకలా ప్రతిపక్ష పార్టీలకు మరోలా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయ స్ఫూర్తి భవనం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఇండియా కూటమి తరపున సిపిఐ నుండి బండి వెంకటేశ్వరరావును ఏలూరు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. అనంతరం వనజ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మత విశ్వాసాల పట్ల విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పనిచేస్తోందని విమర్శించారు. పదేళ్ల బిజెపి పాలనలో ప్రతిపక్షాలు, మేధావులు, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. బిజెపి మతతత్వ పాలనతో ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించకుండా మోడీ పాలనకు వంత పాడుతున్నారని విమర్శించారు. కేసుల నుంచి రక్షణ పొందేందుకు ఢిల్లీ నాయకుల వద్ద రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గం సిపిఐ గెలిచిన చరిత్ర ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ మోడీ తిరిగి అధికారం చేపడితే రాజ్యాంగాన్ని మార్చేసి ప్రతిపక్షాలు లేకుండా చేయడానికి కుట్రపన్నుతున్నారని విమర్శించారు. ఇండియా కూటమి అభ్యర్థిగా సిపిఐ తరఫున బండి వెంకటేశ్వరరావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ బండి వెంకటేశ్వరరావు గెలుపునకు కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా, ఏలూరు నియోజకవర్గంలో అనేక పోరాటాలు చేశామన్నారు. కార్మికుల పక్షాన, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించి పరిష్కారం చేశామన్నారు. తనను సిపిఐ రాష్ట్ర సమితి, ఏలూరు జిల్లా సమితి ఎంఎల్ఏ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి అసెంబ్లీలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వాణి వినిపించడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడుకోవాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

దేశ సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శ్రీ క్రోధ నామ సంవత్సర ఉగాది వేడుకల పురస్కార ఆహ్వాన పత్రికను నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి సోమవారం కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా మన సంస్కృతీ సంప్రదాయాలు తెలియజేస్తూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వేడుకలు విజయవంతం కావాలన్నారు. రంగసాయి మాట్లాడుతూ మంగళవారం భీమేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది పురస్కారాల వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. 66 మందికి ఉగాది పురస్కారాలు అందిస్తున్నామని వివరించారు.

10, 12 తేదీల్లో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు ఈ నెల 10, 12 తేదీల్లో నియోజవర్గ స్థాయిలో ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. ఆచంట, పోడూరు మండలాల అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఐపి శెట్టి, డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాంప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

లంకలకోడేరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య పరిధిలో దగ్గులూరు సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్యజీవన్, 104 డివిజనల్ కో-ఆర్డినేటర్ ఎంవివిఎస్ఎన్.మూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కె అమలేశ్వరరావు, డి.కమల, డిఇఒ సురేష్, ఎంఎల్‌హెచ్‌పి లిఖిత ప్రియ పాల్గొన్నారు.

జల్లికొమ్మరలో...

గణపవరం :ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు పొంది ఆరోగ్య భద్రతను కాపాడుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోషనాయుడు అన్నారు. మండలంలోని జల్లికొమ్మర యుపి పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకుని ఉచిత వైద్య సేవలు పొందాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, తాడేపల్లిగూడెం మదర్ విన్ని డాక్టర్ కె.సుధాకర్, నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్, హెల్త్ విజిటర్స్ సిహెచ్.పద్మజ, ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజుకు పలువురి మద్దతు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, మార్టేరు సర్పంచి మట్టా కుమారీరాము ఆధ్వర్యంలో శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన సుమారు వంద మంది మహిళలు వైసిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు సంఘీభావం తెలిపారు. సోమవారం ఉదయం వారంతా శ్రీరంగనాథరాజు కార్యాలయానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి మద్దతు తెలిపారు. మార్టేరు గణపతి ఆటో యూనియన్ వారు శ్రీ రంగనాథరాజుకు సంఘీభావం తెలిపారు. సంఘానికి చెందిన దొంగ వీరాస్వామి, కుమారస్వామి, బొరుసు లోకనాదం, కుక్కల ఏసు మద్దతు తెలిపారు.

అక్రమ మద్యం రవాణాపై మరింత నిఘా

జెసి, ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రవీణ్‌ఆదిత్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్‌కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

ప్రజాశక్తి - ఉండి

పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో అక్రమ మద్యంపై నిఘా పెంచాలని జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్‌ఆదిత్య అధికారులను ఆదేశించారు. ఉండి ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు రవాణాపై అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎంపిడిఒలు, పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గ పరిధిలో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

వశిష్ట గోదావరిపై వారధి నిర్మాణానికి కృషి చేస్తా

కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి కానూరి బుజ్జి

ప్రజాశక్తి - నరసాపురం

వశిష్ట గోదావరిపై వారధి నిర్మాణానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కరకృష్ణప్రసాద్ (బుజ్జి) అన్నారు. పట్టణంలో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టైలర్‌పేట, ఎండుచేపల మార్కెట్‌లో వ్యాపారులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకొస్తే ప్రత్యేక హోదా తీసుకొస్తామని, పెన్షన్ సొమ్ము రూ.ఐదు వేలు అందిస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లిపూడి శ్రీనివాస్, గుబ్బల కృష్ణారావు, ముస్కుడి సల్మాన్, కె.అమర్, సాధనాల చిన్న పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

2024-25 ఏడాది ముందస్తు పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీ ఇస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వుల ఇచ్చిందని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 లోపు మొత్తం పన్ను ఒకేసారి చెల్లించినవారికి ఐదు శాతం పన్ను రాయితీ అమలవుతుందని తెలిపారు. పన్ను చెల్లింపులు పురపాలక సంఘ కార్యాలయంలో గాని సచివాలయం వద్ద గాని ఆన్‌లైన్‌లో cdma.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా గాని చెల్లించవచ్చని చెప్పారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

ఉపాధి హామీ కూలీలు రోజువారి వేతనం కొలతల ప్రకారం రూ.300 వచ్చే విధంగా పని చేయాలని డ్వామా పీడీ ఎం.ప్రభాకర్ అన్నారు. మండలంలోని భీమలాపురంలో ఉపాధి హామీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్సకు సంబంధించి మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు క్లస్టర్ ఏపీడీ ఎం.సురేష్‌బాబు, ఎంపిడిఒ నరసింహప్రసాద్, జిల్లా టీమ్ మెంబర్స్ శ్రీకాంత్, శ్రీనివాస్, వర్మ, శ్రీను, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పైడికొండల కుటుంబాన్ని కలిసిన మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాజీ మంత్రి, కీర్తిశేషులు పైడికొండల మాణిక్యాలరావు కుటుంబాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ బొడ్డు సాయిబాబా ఉన్నారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడ, చిలుకూరు గ్రామ సచివాలయాల వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయా సచివాలయాల కార్యదర్శులకు రాజీనామా పత్రాలు అందించారు.

'అభివృద్ధి పనుల్లో వైసిపి అవినీతి'

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి హయాంలో ఎక్కడా ఇళ్ల పట్టాలు ఉచితంగా ఇచ్చిన దాఖలాలు లేవని, ఒక్కోపట్టాను రూ.వేలకు అమ్ముకున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. కొడమంచిలిలో మన్నే వెంకటనారాయణ బాబు స్వగృహంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచంట నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు అతని అనుచరులు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. వైసిపి అధికారంలోకొచ్చాక 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, ఆయా కార్పొరేషన్లకు కనీసం కార్యాలయాలు, కుర్చీలు గాని లేకుండా చేసి నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలికులు రుద్రరాజు వెంకటరమరాజు, టిడిపి మండలాధ్యక్షుడు కేత మీరయ్య, ప్రధాన కార్యదర్శి ఏడిద శ్రీనివాస్, జనసేన మండలాధ్యక్షులు జవ్వాది బాలాజీ, ఆచంట ఎంపిపి సూర్యకుమారి, వైస్ ఎంపిపి నాగరాజు, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ అభివృద్ధికి పట్టం కట్టాలని వైసిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. చెరుకువాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ ఇంటి స్థలాలను కేటాయించి సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

'కుయుక్తులకు పాల్పడుతున్న వైసిపి'

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండగా అధికార పార్టీ వైసిపి కుయుక్తులకు పాల్పడుతుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ విమర్శించారు. కొడమంచిలి గ్రామంలో ఆయన సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి సూర్యకుమారి, పార్టీ మండలాధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు బీర నరసింహమూర్తి, చిలుకూరి శ్రీను, వెంకటరమణ, మురళిమోహన్ బాలాజీ, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అయినకాడికి అమ్మేస్తున్నారు..!

(మొదటి పేజీ నుంచి)

ఏర్పాటు చేయడం లేదు. దీంతో ముందుగా మాసూళ్లు చేసిన ప్రాంతాల్లోని రైతులు పంటను రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ప్రతి గ్రామంలోనూ ఆర్‌బికె కేంద్రాలు ఉన్నాయి. ధాన్యం కొనుగోలుకు ముందుగా ఏర్పాట్లు చేస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ అటువంటి ప్రక్రియ మాత్రం జరగడం లేదు. పలు మండల్లాల్లో ఇప్పటికే తాము సాగు చేసిన పంటలో సగం వరకూ అయినకాడికి తెగనమ్ముకున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో పదో తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మాసూళ్లు జరుగుతున్న మండలాల్లో ముందుగా కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేయడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఎకరాకు రూ.20 వేలకుపైగా అన్నదాతకు నష్టం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఎ రకం ధాన్యం 75 కిలోల బస్తా రూ.1652, గ్రేడ్-బి రకం ధాన్యం బస్తాకు రూ.1637 వరకూ ధర ఉంది. ప్రస్తుత రబీలో రైతులు చెబుతున్న ప్రకారం ఎకరాకు 50 నుంచి 55 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో తడిపొడి కింద 75 కిలోల బస్తా ధాన్యం రూ.1250కు రైతులు విక్రయిస్తున్నారు. అంటే బస్తాకు రూ.400 వరకూ రైతులు నష్టపోతున్నారు. ఎకరాకు 50 బస్తాల దిగుబడి చొప్పున లెక్కించినా రూ.20 వేల వరకూ జిల్లా రైతాంగం నష్టపోతున్న పరిస్థితి ఏర్పడింది. రైతులకు మద్దతు ధర దక్కే విధంగా వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ నుంచి)

కేంద్రాన్ని నిలదీయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాంతంలోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో రెండు ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిని, వైసిపి అభ్యర్థులను ఓడించాలని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని రక్షించే వారికే ఓటు వేయాలని కోరారు. గిరిజన, దళిత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూమి, ఇళ్ల స్థలాలు, తాగునీరు, స్థానిక సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, జి.వెంకట్రావు, తామా ముత్యలమ్మ, టి.దుర్గారావు, ఎం.దుర్గారావు, ఎస్.రాంబాబు, పి.సూర్యారావు పాల్గొన్నారు.

మోటారు సైకిల్, కారు ఢీ

(మొదటి పేజీ నుంచి)

అతి వేగంగా దూసుకొచ్చి కూలీలు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు రెండు పల్టీలు కొట్టి పక్కనే ఉన్న మురుగు కాలువలోకి బోల్తా పడింది. ద్విచక్ర వాహనం సుమారు 150 మీటర్ల దూరంలో ఎగిరిపడింది. దీంతో మన్నియ్య, అప్పారావు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రాణాలతో బయట పడ్డారు. మతులు మన్నియ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై యలమంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద ముస్లిములకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

సేవా దృక్పథంతో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి దాతల సహకారం వెలకట్టలేనిదని నన్నేటి ఆనందం, సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ నన్నేటి పుష్పరాజ్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆచంట వేమవరం గ్రామంలో ఆరు పేద ముస్లిం కుటుంబాలకు మాల మహానాడు మండల నాయకులు రావి నాగరాజు బియ్యం బస్తాలు పుష్పరాజ్ చేతులమీదుగా సోమవారం అందిం చారు. ఈ సందర్భంగా రావి నాగరాజును పుష్పరాజ్ అభిన ందించారు. ఈ కార్యక్రమంలో మట్టా చంటి, కోలాటి ప్రసాదరావు, మానుకొండ వెంకటరాజు, కోరం రాహుల్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మేనిఫెస్టో ఇంటింటికీ వివరిద్దాం'

ప్రజాశక్తి - ఆకివీడు

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని తొమ్మిది పథకాలను వివరిస్తూ గడపగడపకూ ప్రచారం చేస్తామని ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్యంరాజు నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సోమవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి సోడాదాసి గంగయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షులు చింతా ఆదిశేషు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కనుమూరి వెంకట్రామరాజు పాల్గొన్నారు.

అందరికీ అండగా ఉంటా : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తనను నమ్మి టిడిపి కూటమితో నడిచిన ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని, జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం కిరాణా వర్తక సంఘం ఆవరణలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన టిడిపి, బిజెపి, జనసేన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తాడేపల్లిగూడెంలో గెలిచేది జనసేన పార్టీనేనన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు కలిసి అన్ని ప్రాంతాల్లో ఓటర్లను కార్యకర్తలను సమన్వయం చేసి పని చేయాలన్నారు.

కొప్పర్రులో ముదునూరి ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

పరిపాలన సులభతరం కోసం గ్రామ సచివాలయం, రైతు భరోసాకేంద్రం, హెల్త్ క్లినిక్ తీసుకొచ్చామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కొప్పర్రులో 21వ రోజు ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్రు గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ తీసుకొచ్చామన్నారు. పక్కనే సుమారు రూ.332 కోట్లతో ఆక్వా యూనివర్సిటీ నిర్మిస్తున్నామన్నారు. చిట్టవరంలో సుమారు రూ.3.4 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీ, నాడు-నేడు పాఠశాలల ఆధునీకరణ చేశామని ముదునూరి శారదావాణి అన్నారు. మండలంలోని చిట్టవరంలో ఎంఎల్ఎ సతీమణి ప్రచారం చేపట్టారు.

నేడు సాహితీ సభ

పాలకొల్లు :పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీ మంగళవారం బంగారు వారి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సాహితీ కీర్మీరం సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం తెలిపారు. క్రోధీ నామ సంవత్సరం సందర్భంగా నిర్వహించే సభకు రసధుని సాహితీ ప్రియులు, కవులు, రచయితలు, సాహిత్య విశ్లేషకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

తాడేపల్లిగూడెం రిటర్నింగ్ అధికారి చెన్నయ్య

తాడేపల్లిగూడెం :దేశ నాయకుల జయంతి, వర్థంతులను రాజకీయాల ప్రచారాలకు వాడుకోవద్దని రాజకీయ పార్టీల నాయకులకు తాడేపల్లిగూడెం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ కె.చెన్నయ్య సూచించారు. తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు, అభ్యర్థులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్ట్ షాపుల వల్ల గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పే అవకాశం ఉందన్నారు. నియంత్రణ ఉంచాలన్నారు. సమావేశాలకు, ప్రచారాలకు అనుమతి తప్పనిసరని చెప్పారు. నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇండియా కూటమితోనే అభివృద్ధి

కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

దేశంలో మతతత్వ శక్తులను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, ఇండియా కూటమితోనే దేశాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరులో మండల విస్తృత సమావేశం పార్టీ మండలాధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టాయన్నారు. పిసిసి అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే తొమ్మిది గ్యారెంటీలను ఇచ్చిందని, వాటిలో ప్రధానమైనది ప్రత్యేక హోదా అని చెప్పారు. అనంతరం దొడ్డనపూడి గ్రామానికి చెందిన ఎండి రమేష్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షులు సోము నాగకేశవబాబు, పార్టీ దొడ్డనపూడి గ్రామ అధ్యక్షులు దుర్గారావు, బొరాడ గౌరీనాయుడు, వెంకన్న వాసు, విజయ్, కుమార్, శ్రీను, వెంకటేశులు, బొర్రా పార్థు పాల్గొన్నారు.

అందరికీ స్వచ్ఛమైన తాగునీరందిస్తా

స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరందించడమే తన ప్రధాన లక్ష్యమని ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలంలోని కలిసిపూడి, చెరుకువాడ, అర్తమూరు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ తన హయాంలోనే కలిసిపూడి, అర్తమూరు, చెరుకువాడ గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత మంచి నీరందించేందుకు సుజల వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశానని చెప్పారు. తర్వాత కాలంలో పాలకులు వాటి నిర్వహణను నిర్లక్ష్యం చేయడంతో అవి నిర్వీర్యమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మరొకసారి ఎంఎల్ఎగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో తాగునీరందించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.

కమిషనర్‌ని బదిలీ చేయండి : బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌ను బదిలీ చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి డిమాండ్ చేశారు. కిరాణా వర్తక సంఘం ఆవరణలో సోమవారం నిర్వహించిన టిడిపి, జనసేన, బిజెపి ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇటువంటి అవినీతిపరుల నుంచి తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని కాపాడాలంటే రానున్న ఎన్నికల్లో జనసేన అభ్యర్థి పొలిశెట్టి శ్రీనివాస్‌ని గెలిపించాలని కోరారు

డిగ్రీ కాలేజీలో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో సోమవారం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పండుగ ప్రాముఖ్యతపై కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు అక్కిరాజు, చైతన్య, స్వాతి, కె.గణేష్, కె.స్వరూపరాణి, జి.వెంకటరమణ, షేక్ అన్వారి, ఎస్‌కె.పర్వాన్, బాల మణికంఠ పాల్గొన్నారు.

'గ్రామాలాభివృద్ధి వైసిపితోనే సాధ్యం'

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాలాభివృద్ధి వైసిపితోనే సాధ్యమని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు, నియోజవర్గ ఎన్నికల పరిశీలకులు వేండ్రా వెంకటస్వామిలతో కలిసి ఆయన సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ప్రచారంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, నాయకులు రాజు, తోటకూర కృష్ణంరాజు, సరిపల్లి సుబ్బరాజు, తిరుమాని సుబ్బారావు, అల్లూరి రంగరాజు, నడింపల్లి సుబ్బరాజు, రేవు నారాయణమూర్తి, కవురు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి జగన్ ప్రాధాన్యత

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువు మాత్రమేనని, సిఎం జగన్ విద్య కోసం రూ.వేలాది కోట్ల నిధులను ఖర్చు చేశారని విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదగరువు, తుందుర్రు, జొన్నలగరువు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే భావనతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అనంతరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు.

నేడు మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉగాది పండుగను పురష్కరించుకుని ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

'వైసిపిని మరోసారి ఆశీర్వదించాలి'

ప్రజాశక్తి - ఆచంట

మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు అన్నారు. వల్లూరు గ్రామంలో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారన్నారు. ప్రజలందరూ జగన్‌కు అండగా నిలిచి మరోసారి సిఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, నారిన వీర వెంకట సత్యనారాయణ, పిచ్చెట్టి సత్యనారాయణ, సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, విజయలక్ష్మి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

ఉపాధి హామీ పనులు కల్పించాలి : వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో మండలంలోని బంగారుగూడెం గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సంద ర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల కోసం కూలీలు ఎదురు చూస్తున్నారన్నారు. తక్షణమే అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల కల్పనకు అధికారులు కృషి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పి.విజయమ్మ, బుర్ల వెంకట లక్ష్మి, నక్క లక్ష్మి, కెల్లెం జ్యోతి, గులిమి మేరీ, దుట్రు సత్యవతి, కొలుకో పద్దయ్య, బోయిన వెంకటేశ్వరరావు, మూర్తి, వెంకట లక్ష్మి, గంగుల రాంబాబు, వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 11వ వార్డులోని 16, 18 క్లస్టర్స్‌లో జరుగుతున్న ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రై డే కార్యక్రమాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల వద్ద ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. వారానికోసారి డ్రై డే పాటించడం ద్వారా దోమల నియంత్రణ సాధ్యమన్నారు. కీటక జనిత ప్రదేశాలు గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని ఆదేసించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు పి.పోసమ్మ, అశా కార్యకర్త దీపిక, అంగన్‌వాడీ కార్యకర్త అరుణ, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

'అభివృద్ధి చేస్తుంటే విమర్శలు తగవు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి గ్రామంలో వైసిపి చేసిన అభివృద్ధి కనిపిస్తున్నా టిడిపి విమర్శలు చేయడం తగదని వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని భట్లమగటూరులో ఆయన సోమవారం ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. భట్లమగటూరు ముద్దుబిడ్డ జస్టిస్ కటికతల రామస్వామి సలహాలు తీసుకుని ఆ మేరకు గ్రామంలో రూ.రెండు కోట్ల వ్యయంతో ఎన్నో పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర జెడ్‌పిటిసి సభ్యులుకర్రి గౌరీ సుభాషిణి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'వైసిపి మోసాలను ప్రజలు నమ్మరు'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రాభివృద్ధిని కుంటు పరిచి అప్పుల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచిన సిఎం జగన్ మోసపూరిత అబద్ధాలు, మాటలు మరోసారి నమ్మి ప్రజలు ఓటు వేసేందుకు సిద్ధంగా లేరని టిడిపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మీ అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ జగన్ మోసాలను, అరాచక, హత్య రాజకీయాలను చంద్రబాబు, పవన్, పురింధేశ్వరి ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తున్నందున జగన్ తట్టుకోలేక అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారన్నారు. టిడిపి కూటమి అధికారంలోకొచ్చాక చంద్రబాబు 20 లక్షల మంది నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తారన్నారు.

దళిత సమస్యలపై నిర్దిష్ట హామీలు మేనిఫెస్టోలో చేర్చాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజగోపాల్

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు దళిత సమస్యలపై నిర్దిష్టమైన, అమలయ్యే హామీలే మేనిఫెస్టోలో చేర్చాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సంఘం పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి దళిత, బిసి, గిరిజన, ప్రజాసంఘాలు, వామపక్షాల నాయకులు హాజరయ్యారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధంగా కులవ్యవస్థ పటిష్ట పరిచే బిజెపిని, దాని అనుబంధ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని ముక్తకంఠంతో నినదించారు. అనంతరం దళిత సమస్యలపై కెవిపిఎస్ రూపొందించిన డిక్లరేషన్‌ను నేతలంతా కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత హామీలతో దళితులను మోసం చేస్తున్నాయన్నారు. మళ్లీ అధికారంలోకొస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బిజెపి బహిరంగంగానే చెప్తుందన్నారు. బహుజన ఎపి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసెఫ్ మాట్లాడుతూ 77 ఏళ్ల స్వాతంత్ర్యంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల హక్కులను కాలరాస్తున్నారన్నారు. సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ దేశంలో అత్యధికులుగా, శ్రామికులుగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసిల స్థానం అట్టడుగున ఉండడం బాధాకరమన్నారు. దళితులకు సామాజిక న్యాయమే ధ్యేయంగా దళిత సమస్యలపై నిర్దిష్టంగా సిపిఎం మేనిఫెస్టోలో చేర్చామని తెలిపారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ దళిత, బిసిల ఐక్యతతో హక్కులను కాపాడుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లిపూడి ఆంజనేయులు మాట్లాడుతూ దళితులకు అండగా నిలిచిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్, ఎపి బహుజన జెఎసి రాష్ట్ర కార్యదర్శి బిరుదుగడ్డ రమేష్, జిల్లా అధ్యక్షులు ఈది రవి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు గాతల జేమ్స్, పట్టణ పౌరుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, జెఎసి నాయకులు బుంగ ఆదాము, జి.మేరీ అలిశా, వి.సత్యవాణి, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కానేటి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, పి.శ్యామ్‌బాబు, బాతు రామస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజగోపాల్

జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఉగాది శుభాకంక్షాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా ప్రజలందరికీ ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదంతా జిల్లా ప్రజలకు అన్ని శుభాలు కలగాలని, ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పండుగను ప్రజలందరూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కలెక్టర్ శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఆకాశాన్నంటిన ఉగాది పచ్చడి సరుకుల ధరలు

ప్రజాశక్తి - నరసాపురం

ఉగాది పచ్చడికి సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. ఉగాది పచ్చడిలో షడ్రుచుల్లో కీలకమైన చెరుకు ముక్కలు, మామిడి కాయ, అరటి పండ్లు, వేప పువ్వుకు మంచి డిమాండ్ ఏర్పడింది. మామిడికాయ చిన్నది రూ.30, అరటి పండ్లు డజను కర్పూరం హస్తం రూ.80, చెరకు ముక్క చిన్నది రూ.20లకు విక్రయించారు. వేప పువ్వును కూడా 20పైబడి అమ్మకాలు చేపట్టారు. గుమ్మలకు మామిడి తోరణాలకు ఆరు రొబ్బలు రూ.30 చొప్పున అమ్మారు. పట్టణంలో మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్డులో వ్యాపారాలు జోరుగా సాగాయి.

239 ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు

జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణకు ఏలూరు జిల్లాలో 239 రైతు భరోసా కేంద్రాలు గుర్తించామని జాయిట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల కార్యాచరణ ప్రారంభంపై ఆమె మాట్లాడారు. రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న ధాన్యం సేకరణకు 239 రైతు భరోసా కేంద్రాలను గుర్తించి ఈ నెల ఆరో తేదీ నుంచి కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. రబీ సీజన్‌కు పండిన ధాన్యానికి గ్రేడ్ ఎ రకానికి క్వింటాలు రూ. 2,203, సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,183, కనీస మద్దతు ధర ఎఫ్‌ఐసి నిర్ణయించారని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు సంబంధించి రైతు తమ సొంతంగా వాహనం, లేబరు ఖర్చు, గోనె సంచులు ఉపయోగించుకుంటే రైతుకు నేరుగా సొమ్ములు చెల్లిస్తామని చెప్పారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డిఎం మంజూభార్గవి పాల్గొన్నారు.

రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్న 'శశి'

ప్రజాశక్తి - పాలకొల్లు, పాలకొల్లు రూరల్

పాలకొల్లు, దిగమర్రులో ఉన్న శశి విద్యాసంస్థలు నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులకు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నారని, తగు చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షులు సిహెచ్.సుందర్ డిమాండ్ చేశారు. సోమవారం రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్న శశి విద్యాసంస్థల వద్దకు ఎఐఎస్ఎఫ్ నాయకులు వెళ్లి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా సుందర్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న శశి విద్యాసంస్థలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పాలకొల్లు సమితి నాయకులు వై.సంతోష్, వి.కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా అన్నారు. జంగారెడ్డిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి తాను ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తాను వైసిపిలో ఉండగా నియోజకవర్గ అభివృద్ధికి ఒక కోటి రూపాయలు మాత్రమే నిధులు విడుదల చేసిందని, దీంతో పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో అభివృద్ధి చేయలేకపోయానని చెప్పారు. అనంతరం టిడిపి, వైసిపి నుంచి సుమారు 50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి.

రియల్ టైమ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలి

భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ శాస్త్రవేత్త అనిల్‌కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు కొత్త కొత్త యాప్‌లు, రియల్ టైమ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి కృషి చేయాలని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ హైదరాబాద్) శాస్త్రవేత్త డాక్టర్ జి.అనిల్‌కుమార్ సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో మాట్లాబ్ సిములింక్ అంశంపై విద్యార్థులకు సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ దేశ రక్షణ అవసరాల కోసం అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణులు, ఆయుధాలు, యుద్ధ వాహనాల రూపకల్పనకు భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. విద్యార్థులు నాణ్యమైన, ఉన్నతమైన ఆలోచనలు చేస్తూ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే విభిన్న పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం అనిల్ కుమార్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ బాబూరావు, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ హైమావతి పాల్గొన్నారు.

పటిష్ట ప్రణాళిక అమలు : కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో తాగునీరు, విద్యుత్తు సరఫరా, జాతీయ ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డికి వివరించారు. వెలగపూడి సెక్రటేరియట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, జాతీయ ఉపాధి హామీ చట్టం పనులు చేపట్టడం, కూలీలకు ఉపాధి కల్పించడం, వేసవిలో విద్యుత్తు సరఫరా, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్, డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బివివి.నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

తాగునీటి అవసరాల కోసం కంట్రోల్ రూమ్

వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరిష్కారానికి భీమవరం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే 08816-299616 సమాచారాన్ని అందించాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారం మేరకు ఆయా ప్రాంతాలకు సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

ఏలూరు సిటీ :పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం సోమవారం నాటికి వంద శాతం ప్రశాంతంగా పూర్తయిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఏలూరులోని సెంట్ జెవిఆర్ పాఠశాలలో పదో తరగతి ప్రశ్నాపత్రాలు మూల్యాంకనానికి సోమవారం 1018 మంది సిబ్బంది హాజరయ్యారని చెప్పారు. ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ప్రశాంతంగా జరగడానికి సహకరించినవారందిరకీ కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - కాళ్ల



కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న క్రైస్తవసంఘాల నాయకులు

క్రైస్తవులకు మతోన్మాది చర్యల నుంచి రక్షణ కల్పించాలని ఎపిసిపిఎ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్ పోలీస్ అధికారులను కోరారు. కాళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద క్రైస్తవ సంఘాలు సోమవారం ఆందోళన చేశాయి. ఈ సందర్భంగా క్రైస్తవ నాయకులు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం ఉండి వెళ్లే దారిలో ఉన్న పెదఅమిరం-ఉప్పరగూడెం రోడ్డులో నలుగురు క్రైస్తవులు కరపత్రికలు, బైబిలు పట్టుకుని నిలిచిఉండగా అటువైపుగా వెళ్తున్న మహదేవపట్నం గ్రామానికి చెందిన కముజు శ్రీనివాస్ వారి వద్దకు వెళ్లి వారిని మతం పేరున కించపరిచి, దుర్భాషలాడి వారి చేతిలో ఉన్న బైబిల్ లాక్కుని పక్కనే ఉన్న మురుగు బోదెలోకి విసిరివేశాడన్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆకివీడు సిఐ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఇటీవల క్రైస్తవులపై జిల్లాలో విపరీతంగా దాడులు పెరుగుతున్న నేపథ్యంలో అల్లరి మూకలను అదుపు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని చెప్పారు. ఇలాంటి సంఘ విద్రోహక చర్యలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ప్రెసిడెంట్ జిడివి ఫౌండేషన్ రాజేష్‌కన్నా, ఎఐసిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర అధ్యాపకుడు ఉమామహేశ్వరరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్, టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో సిఎస్ఇ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సాకా ఉమామహేశ్వరరావుకు డాక్టరేట్ డిగ్రీ లభించింది. బిగ్ డేటా క్లాసిఫికేషన్ అంశంపై ఉమామహేశ్వరరావు చేసిన పరిశోధనలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాదరెడ్డి చేతులమీదుగా ఉమామహేశ్వరరావు డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

జాతీయస్థాయి పోటీలకు నూజివీడు విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పుదుచ్చేరిలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడు నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ వాకా నాగరాజు తెలిపారు. ప్రభువు దీపిక, ప్రణవి, మైథిలి, రాహుల్ ఎంపికైనట్లు తెలిపారు. 20 ఏళ్ల తర్వాత నూజివీడు నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టీమ్‌కు కెప్టెన్సీ అవకాశం లభించిందన్నారు. రాష్ట్ర టీమ్‌కు కెప్టెన్‌గా రాహుల్‌కు అవకాశం లభించిందన్నారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు 16వ డివిజన్ అరుంధతిపేట 42వ సచివాలయానికి చెందిన 16 మంది సచివాలయ వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. అనంతరం ఎంఎల్ఎ ఆళ్ల నానిని తన క్యాంపు కార్యాలయంలో కలుసుకుని మద్దతు తెలిపారు. దెందులూరు మండలం పోతునూరులో 15 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శి షరీఫ్‌కు అందించారు.

నూజివీడు రూరల్ : మండలంలోని జంగంగూడెం గ్రామానికి చెందిన 16 మంది వాలంటీర్లు రాజీనామా చేస్తూ ఎంపిడిఒ కిరణ్‌కుమార్‌కు సోమవారం రాజీనామా లేఖలను అందించారు.

ఉంగుటూరు : మండలంలోని బొమ్మిడిలో 12 మంది గ్రామ వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి ఎం.కొండలరావుకు రాజీనామా లేఖలను అందించారు. మండలంలో ఇప్పటివరకు మొత్తం 33 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు.

పాలకోడేరు : మండలంలోని గొల్లలకొడేరు గ్రామనికి చెందిన 14 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తాము విధులు నిర్వహించలేకపోతున్నట్లు వారు తెలిపారు.